క్లుప్తంగా

వైభవంగా కల్యాణ మహోత్సవాలు


లక్ష్మీగణపతి స్వామి

పాలకొల్లు సెంట్రల్: పట్టణంలోని ఏఏవీ స్ఎస్ కాలనీలో కొలువై ఉన్న శ్రీ లక్ష్మీ గణపతి ఆలయంలో స్వామివారి 19వ కల్యాణ వార్షికోత్సవాలు అత్యంత వైభవంగా ప్రారంభమయ్యాయి. కల్యాణ మహోత్సవాల్లో భాగంగా ఆదివారం శ్రీ సిద్ధి బుద్ధి సమేత వరసిద్ధి వినాయక స్వామివార్ల పాంచాహ్నిక కల్యాణం అంగరంగ వైభవంగా నిర్వహించారు. ముందుగా సన్నిధిరాజు శివదుర్గ శర్మ, కొత్తలంక సుభాష్ శర్మల యాజ్ఞీకంలో స్వామివారికి గణపతి పూజ, పంచామృతాభిషేకం కార్యక్రమాలు జరిపించారు. స్వామివారి కల్యాణ మహోత్సవాలు 19 వరకూ నిర్వహించనున్నట్లు ఆలయ కమిటీ సభ్యులు తెలిపారు. పూజా కార్యక్రమాలు అనంతరం భక్తులు తీర్థప్రసాదాలు స్వీకరించారు.

వెంకమ్మవారి హుండీ ఆదాయం లెక్కింపు


హుండీ ఆదాయాన్ని లెక్కిస్తున్న కమిటీ సభ్యులు

యలమంచిలి: మేడపాడు గ్రామ దేవతలు కొర్లపాటి వెంకమ్మ, కనకదుర్గమ్మ, జువ్వాలమ్మ అమ్మవార్ల జాతర ఉత్సవాలు గత ఆదివారం జరిగిన అన్నసమారాధనతో ముగిశాయి. కమిటీ సభ్యులు, ఆలయ వంశపారంపర్య ధర్మకర్తలు ఆదివారం సమావేశమై జాతర, ఉత్సవానికి సంబంధించి జమా, ఖర్చుల లెక్కలు చూశారు. అనంతరం హుండీ తెరిచి కమిటీ సభ్యులంతా హుండీ ఆదాయన్ని లెక్కించారు. హుండీ ఆదాయం రూ.77 వేలు వచ్చిందని కమిటీ సభ్యులు తెలిపారు.

వైభవంగా చండీ సమేత రుద్రహోమం


సిద్ధాంతం గరగాలమ్మ దిబ్బలో చండీ సమేత రుద్ర హోమం నిర్వహిస్తున్న దృశ్యం

పెనుగొండ: మండలంలోని సిద్ధాంతం గరగాలమ్మ దిబ్బలో శెట్టి బలిజ సంఘం ఆధ్వర్యంలో చండీ సమేత రుద్ర హోమం ఘనంగా నిర్వహించారు. ఆదివారం ఉదయం నుంచి కలగ సంతోష శర్మ బ్రహ్మత్వంలో వేద మంత్రోచ్ఛరణతో వైభవంగా హోమం నిర్వహించారు. ఉదయం పార్థీవ లింగేశ్వర స్వామికి ఏకాదశ రుద్రాభిషేకం, చండీ పారాయణ, చండీహోమం, చతుర్విద పారాయణ ఘనంగా నిర్వహించారు. కార్యక్రమంలో గరగాలమ్మ దిబ్బ శెట్టి బలిజ సంఘ పెద్దలు, యూత్ సభ్యులు పాల్గొన్నారు.

మావుళ్లమ్మకు విరాళాలు


మావుళ్లమ్మకు వెండి శంఖం సమర్పిస్తున్న దృశ్యం

భీమవరం (ప్రకాశంచౌక్): శ్రీ మావుళ్లమ్మకు భీమవరం వాసి మద్దిరాల ఈశ్వర శ్రీ హర్ష అమ్మవారి అభిషేకానికి 400 గ్రాముల వెండి శంఖం అందజేశారు. వీరికి ఆలయ అర్చకుడు మద్దిరాల మల్లికార్జున శర్మ పూజలు నిర్వహించారు. అదే విధంగా చెన్నైకు చెందిన జకామశా శాస్త్రి ఘనాపాఠి, భారతి దంపతులు అమ్మవారికి బంగారు చీర నిమిత్తం రూ.11వేలు అందజేశారు. అర్చకుడు కొడమంచిలి కొప్పేశ్వర రావు పూజలు నిర్వహించారు. ఆలయ సహాయ కమిషనర్ బుద్ధ మహాలక్ష్మి నగేష్ దాతలకు శేష వస్త్రం, ప్రసాదాలు అందజేశారు.

కొల్లేరు ఉప్పు చేప.. రుచి అమోఘం

ఆకివీడు: సముద్రపు చేపల్ని ఎండబెట్టి ఉప్పు చేపలుగా విక్రయిస్తారు. ఆ చేపల రుచే వేరని పలువురు గుటకలేస్తారు. అయితే కొల్లేరు తీరంలో పడిన చేపల్ని ఎండబెట్టి ఉప్పు చేపలుగా తయారు చేసి విక్రయిస్తున్నారు. సముద్రపు ఉప్పు చేప కన్నా రుచిలో తామేమీ తక్కువ కాదన్నట్లుగా కొల్లేరు ఉప్పుచేప పోటీ పడుతోంది. కొల్లేరు సరస్సులోనూ, తీర ప్రాంతంలో లభించిన కట్టిపరిగి, జెల్ల, గొరక, పండుగప్ప, కొరమేను, మట్టగిడస, ఇంగిలాయ్, వివిధ రకాల చిన్న చేపల్ని ఎండబెట్టి ఉప్పు చేపలుగా తయారు చేసి విక్రయిస్తున్నారు. ఉప్పు చేపలు మహారుచిగా ఉంటున్నాయని భోజన ప్రియులు చెబుతున్నారు. కొల్లేరు తీరంలోనూ, కాలువల్లో ప్రసిద్ధి చెందిన శాక రొయ్యని కూడా ఎండు రొయ్యగా తయారు చేసి విక్రయిస్తున్నారు. కొల్లేరు తీర గ్రామాల్లోని మహిళలు, వృద్ధులు ఎండు చేపల విక్రయాల్లో పాల్గొంటూ కుటుంబ ఆదాయానికి తోడ్పడుతున్నారు.

గ్రామాల్లో ఉపాధి పనుల జోరు

- కూలీలకు చేతినిండా పనులు
- 992 పనుల నిమిత్తం రూ.24.64కోట్లు ప్రతిపాదనలు

పాలకొల్లు అర్బన్: మండలంలో ఉపాధి పనులు జోరుగా సాగుతున్నాయి. పాలకొల్లు నియోజకవర్గంలో 2024–25 ఆర్థిక సంవత్సరంలో యలమంచిలి, పోడూరు, పాలకొల్లు మండలాల్లో 992 పనుల నిమిత్తం రూ.24.64కోట్లు ప్రతిపాదనలు సిద్ధం చేశారు. ఏప్రిల్, మే, జూన్ నెలల్లో రైతులకు ఉపయోగపడే పంటబోదెలు తవ్వకం, మురుగు కాలువలు పేరుకుపోయిన చెత్త తొలగింపు, పంట కాలువల్లో తూడు, గుర్రపు డెక్క తొలగింపు పనులు చేపట్టారు. మొదటి మూడు నెలల్లోనే సుమారు రూ.9 కోట్ల విలువైన పనులు పూర్తి చేశారు. 480 కుటుంబాలు సుమారు 100 రోజుల పని దినాలు పూర్తి చేసుకోవడానికి దగ్గరలో ఉన్నారు. ఈ నేపథ్యంలో అధికారుల అంచనాలకు అనుగుణంగా గ్రామాల్లో ఉపాధి పనులు వేగంగా చేస్తున్నారు. అలాగే కూలీలకు కూడా ఉపాధి పనులు లభిస్తున్నాయి.

ఉపాధి పనులు ఇలా

మండలం	ఉపాధి పనులు	అంచనా మొత్తం
పాలకొల్లు	255	రూ.8.61కోట్లు
యలమంచిలి	480	రూ.8.61కోట్లు


లంకలకోడేరులో పంట బోదె తవ్వుతున్న ఉపాధి కూలీలు


బల్లిపాడు వద్ద రాపాక ఛానెల్‌లో తూడును తొలగిస్తున్న ఉపాధి కూలీలు


పెదమామిడిపల్లిలో పంట బోదె తవ్వుతున్న ఉపాధి కూలీలు

100 రోజులు పనులు పూర్తి చేశా



నేను, నా భార్య చింతపర్రులో ఉపాధి పనులు చేశాం. పంట బోదెల తవ్వకం పనులు చేశాం. దీంతో గత మూడు నెలల్లో 100 రోజులు పని లభించింది. రోజు కూలీ రూ.287 కిట్టింది.
– తరపట్ల సత్యనారాయణ, చింతపర్రు

పంట కాలువ పనులు చేశాం



రాపాక ఛానెల్ శివారున మా గ్రామం తిల్లపూడి ఉంది. పంట కాలువ పూడిపోయింది. దీంతో ఉపాధి పనుల్లో మరమ్మతులు చేశారు. నేను, నా భార్య ఇరువురు కలిసి ఉపాధి పనులు చేసుకున్నాం. వ్యవసాయ పనులు లేని సమయంలో ఉపాధి పనులు కూలీలకు బాగా ఉపయోగపడుతున్నాయి.
– కె.అప్పారావు, తిల్లపూడి

రంగనాథరెడ్డి మృతికి సంతాపం


రంగనాథరెడ్డి కుటుంబాన్ని పరామర్శిస్తున్న మాజీ మంత్రి రంగనాథరాజు

పెనుమంట్ర: ఇటీవల నత్తారామేశ్వరం గ్రామంలో వైఎస్సార్ సీపీ నాయకుడు ద్వారంపూడి మురళీకృష్ణ రంగనాథరెడ్డి మృతిపై మాజీ మంత్రి, జిల్లా వైఎస్సార్‌సీపీ అధ్యక్షుడు చెరుకువాడ శ్రీరంగనాథరాజు సంతాపం తెలిపారు. ఆయనతో పాటు రంగనాథరాజు తనయుడు చెరుకువాడ నరేష్‌రాజు ఆయన కుటుంబ సభ్యులను ఆదివారం నత్తారామేశ్వరంలో పరామర్శించి సంతాపాన్ని వ్యక్తం చేశారు. రంగనాథరెడ్డి కుటుంబం పార్టీకి ఎనలేని సేవ చేసిందని ఆయన మృతిపై విచారం వ్యక్తం చేసి సానుభూతిని వ్యక్తం చేశారు. ముందుగా రంగారెడ్డి చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులు అర్పించారు. కార్యక్రమంలో వైఎస్సార్ సీపీ నాయకుడు ద్వారంపూడి శ్రీనివాసరెడ్డి, సర్పంచ్ వెలగల ధర్మారెడ్డి, మాజీ సర్పంచ్ చవ్వాకుల లక్ష్మి, గ్రామ కమిటీ అధ్యక్షుడు తమనంపూడి అయ్యప్పరెడ్డి, మండల మాజీ కన్వీనర్ కర్రి రామలింగేశ్వరరెడ్డి, ఉపసర్పంచ్ కిరణ్ కుమార్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

ఉచిత వైద్య శిబిరాలను వినియోగించుకోవాలి


యర్రంశెట్టి వారిపాలెంలో వైద్య శిబిరాన్ని నిర్వహిస్తున్న దృశ్యం

నరసాపురం రూరల్: ఉచిత వైద్య శిబిరాలను పేదలంతా సద్వినియోగం చేసుకోవాలని యర్రంశెట్టి వారిపాలెం సర్పంచ్ యర్రంశెట్టి నాగముత్యమాంబ అన్నారు. ఆదివారం గ్రామంలోని పంపచాయతీ కార్యాలయం వద్ద ఏర్పాటు చేసిన వైద్య శిబిరాన్ని ఆమె ప్రారంభించారు. కార్యక్రమంలో పాలకొల్లు ఉమా హాస్పటల్ వైద్యురాలు కావలి ఉమాదేవి నొప్పి లేకుండా నార్మల్ డెలివరీ, హైరిస్క్ ప్రెగ్నెన్సీ, గర్భ సంచి ఆపరేషన్లు, క్యాన్సర్ స్క్రీనింగ్ పరీక్షలు అండాశయంలోని గడ్డలు, నీటి బుడగలు తొలగించడం వంటి అంశాలపై శిబిరానికి వచ్చిన స్త్రీలకు వాటి గురించి అవగాహన కల్పించారు. అనంతరం వైద్య శిబిరానికి వచ్చిన సుమారు 150 మంది మహిళలకు వైద్య పరీక్షలు నిర్వహించి మందులను అందజేశారు. కార్యక్రమంలో ఏఎంసీ మాజీ వైస్ చైర్మన్ యర్రంశెట్టి బాబులు, కో ఆర్డినేటర్ విశ్వ వెంకటేశ్వర్లు, తెలగం శెట్టి వాసు, శ్రీదేవి తదితరులు పాల్గొన్నారు.

శివారు ప్రాంతంలో సార్వా సాగు ఆలస్యం


మొగల్తూరు నల్లంవారితోటలో చేనులో నిలిచిన నీరు

మొగల్తూరు: ఈ ఏడాది సార్వా సాగు పనులు ఇప్పటి వరకూ ప్రారంభం కాలేదు. వరుణుడు కరుణించకపోవడంతో పాటు కాలువలోని నీరు పుష్కలంగా అందకపోవడంతో ఆకుమడులు వేసుకునేందుకు ఆలస్యం కానుంది. గత ఏడాది జూన్ నెలలోనే ఆకుమడులు వేసుకోవడం మరికొన్ని ప్రాంతాలలో నాట్లు వేయడం పూర్తయ్యాయి. అయితే ఈ ఏడాది జూన్ నెల పూర్తి కావస్తున్నా ఇంకా పూర్తి స్థాయిలో వర్షాలు కురవలేదు. మరోవైపు కాలువలు వదిలినా శివారు ప్రాంతాలకు పూర్తి స్థాయిలో నీరందడంలేదు. దీంతో పంటబోదెల్లోకి వచ్చిన కొద్ది పాటి నీటితో చేలను నింపుతున్నారు. మరో నాలుగైదు రోజుల్లో దుక్కులు దున్ని ఆకుమడులు వేస్తామని రైతులు పేర్కొంటున్నారు. మరోవైపు 150 రోజులకు పంట చేతికొచ్చే ఎంటీయు 1061,1064,1318,పీఎల్ 1100 రకాల విత్తనాలను వినియోగించాలని వ్యవసాయాధికారులు సూచిస్తున్నారు. ఆకుమడులు వేసుకోవడం ఆలస్యమైతే వెదజల్లేపద్ధతి పాటించాలని రైతులను కోరుతున్నారు. రైతు భరోసా కేంద్రాల్లో విత్తనాలు, ఎరువులు, పురుగు మందులు అందుబాటులో ఉంచుతున్నామని, రైతులకు అవసరమయ్యే సలహాలు, సూచనలు అందించేందుకు సిద్ధంగా ఉన్నామని ఏఓ అబ్దుల రహీమ్‌తెలిపారు.

ప్రశాంతంగా మండల పరిషత్ సర్వసభ్య సమావేశం


ఆచంట మండల పరిషత్ సమావేశంలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే పితాని

పెనుగొండ: కూటమి ప్రభుత్వం ప్రజా ప్రభుత్వమని, ప్రజలకు అండగా నిలుస్తుందని మాజీ మంత్రి, ఆచంట ఎమ్మెల్యే పితాని సత్యనారాయణ అన్నారు. ఆదివారం ఆచంట మండల పరిషత్ కార్యాలయంలో ఎంపీపీ దిగమర్తి సూర్యకుమారి అధ్యక్షతన నిర్వహించార. మండల పరిషత్ సమావేశంలో ఆయన మాట్లాడుతూ ప్రతిపక్షాన్ని సైతం గౌరవిస్తామన్నారు. గ్రామాల్లో ప్రతిపక్ష ప్రజానిధులను గౌరవించడంతో పాటు, తమ పార్టీ కార్యకర్తలను గౌరవించాలని అధికారులకు సూచనలు చేశారు. ముఖ్యంగా గ్రామస్థాయిలోని అధికారులు విధులు సక్రమంగా నిర్వహించాలన్నారు. నిర్లక్ష్యం వహిస్తే సహించేదని హెచ్చరించారు. మండలంలో రైతులకు ధాన్యం బకాయిలు రూ.54 కోట్లు 79 లక్షలు రావాల్సి ఉందని, త్వరలోనే సంబంధిత మంత్రితో మాట్లాడి నిధుల విడుదలకు కృషి చేస్తానన్నాఉ. రైతులకు సాగు నీరు ఇబ్బందులు లేకుండా చర్యలు తీసుకుంటామని వివరించారు. కార్యక్రమంలో భాగంగా ప్రభుత్వ పాఠశాలల విద్యార్థులకు విద్యా కిట్లు పంపిణీ చేశారు. ప్రభుత్వ విద్యను బలోపేతం చేయడానికి ఉపాధ్యాయులు సహకరించాలని మాజీ మంత్రి పితాని సత్యనారాయణ విజ్ఞప్తి చేశారు. కార్యక్రమంలో జెడ్పీటీసీ సభ్యుడు ఉప్పల పాటి సురేష్ బాబు, వైస్ ఎంపీపీలు యర్రగొప్పుల నాగరాజు, తాళం శ్రీనివాసు తదితరులు పాల్గొన్నారు.

మానవత ఉచిత వైద్య శిబిరం


పెనుగొండలో మానవత ఉచిత వైద్య శిబిరంలో వైద్య పరీక్షలు నిర్వహిస్తున్న దృశ్యం

పెనుగొండ: మానవత స్వచ్ఛంద సంస్థ, పెనుగొండ ఎస్వీకేపీ అండ్ డాక్టర్ కేఏస్‌రాజు కళాశాల ఎన్ఎస్ఎస్ విభాగం ఆధ్వర్యంలో ఆదివారం పెనుగొండలో ఉచిత దంత వైద్య శిబిరం నిర్వహించారు. అమృత హాస్పటల్, రత్నాస్ సూపర్‌స్పెషాలిటీ డెంటల్ హాస్పటల్ సహకారంతో ఉచిత వైద్య శిబిరం నిర్వహించగా శిబిరంలో 47 మందికి షుగర్, బీపీ, కీళ్ల నొప్పులు, గుండె జబ్బులుకు వైద్య పరీక్షలు నిర్వహించి మందులు అందచేశారు. వీరితో పాటు 22 మందికి దంత వైద్య పరీక్షలు నిర్వహించి మందులు అందించారు. అమృత హాస్పటల్ వైద్యులు డాక్టర్ వల్లభనేని కిషోర్, డాక్టర్ పి.బార్గవ్ సాయిరాం, రత్నాస్ హాస్పటల్ వైద్యులు డాక్టర్ మేడపాటి మురళీ జోగిరెడ్డిలు వైద్య సేవలు అందించినట్లు మానవత మండల అధ్యక్షుడు నేమాని శ్రీనివాస్ తెలిపారు. కార్యక్రమంలో మానవత ఉపాధ్యక్షుడు నల్లిమిల్లి విజయరాజు, కోశాధికారి బచ్చు లక్ష్మీ నరసింహమూర్తి, రీజనల్ డైరక్టరు కర్రి నరేంద్ర రెడ్డి, డైరెక్టర్లు కాకర శశికుమార్, మురళీ కృష్ణ, రమేష్, కార్యవర్గ సభ్యులు షేక్ మస్తాన్, అత్యం నవీన్, టి.దివాకర్, వసంతకుమార్, శివరామిరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

నిరంతరాయంగా మజ్జిగ పంపిణీ


చలివేంద్రంలో మజ్జిగ పంపిణీ చేస్తున్న దృశ్యం


సిద్ధాంతంలో మజ్జిగ పంపిణీ చేస్తున్న దృశ్యం

నరసాపురం: పట్టణంలోని ప్రకాశంరోడ్డులో కృష్ణా స్వీట్స్ అధినేత గుడివాడ ప్రభాకర్ వేసవి మొదట్లో మార్చినెలలో ప్రారంభించిన చలివేంద్రాన్ని నిరంతరాయంగా కొనసాగిస్తున్నారు. ఆదివారం చలివేంద్రంలో మజ్జిగ పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గత మూడునెలల నుంచి కూడా చలివేంద్రంలో మజ్జిగ పంపిణీ చేస్తున్నామన్నారు. ప్రతి రోజూ 3వే లమందికి మజ్జిగ పంపిణీ చేస్తున్నామని చెప్పారు.

పెనుగొండంలో..

పెనుగొండ: ఎండ తీవ్రత అధికంగా ఉండడంతో సిద్ధాంతంకు చెందిన దాత మండవల్లి హరిప్రసాద్ ఆధ్వర్యంలో మజ్జిగ చలివేంద్రం ఏర్పాటు చేసి మజ్జిగ పంపిణీ చేశారు. వేసవి ప్రారంభం నుంచి మజ్జిగ చలివేంద్రాన్ని నిర్వహిస్తున్నారు. అలాగే సిద్ధాంతంలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల, ప్రాథమిక పాఠశాలల్లో చదువుతున్న విద్యార్థులకు ఆదివారం మండవల్లి హరిప్రసాద్ విద్యా సామగ్రి అందించారు.

కాస్మో క్లబ్ నూతన కార్యవర్గం ఎంపిక


సమావేశంలో మాట్లాడుతున్న కాస్మో క్లబ్ నూతన కార్యవర్గ సభ్యులు

పాలకొల్లు సెంట్రల్: స్థానిక కాస్మో కల్చరల్, స్పోర్ట్స్ కాంప్లెక్స్ నూతన కార్యవర్గాన్ని ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. ఆదివారం కాస్మో క్లబ్ ఆవరణలో నిర్వహించిన నూతన కార్యవర్గం ఎంపికలో అధ్యక్షుడిగా గొట్టుముక్కల గాంధీభగవాన్‌రాజు, సెక్రటరీ వివి సోమరాజు, ట్రెజరర్ ఆర్ రమేష్‌బాబులను ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. గౌరవ అధ్యక్షుడిగా సిహెచ్ శ్రీనివాసరాజు, జాయింట్ సెక్రటరీ దండు గోపాలకృష్ణరాజు, 15 మంది సభ్యులను ఈసీ మెంబర్లుగా ఎంపికచేశారు. ఈ సందర్భంగా నూతన అధ్యక్షులు గాంధీభగవాన్ రాజు మాట్లాడుతూ భవిష్యత్‌లో కాస్మోక్లబ్‌లో బ్యాడ్మింటన్, టెన్నిస్‌లలో ట్రైనింగ్ ఇవ్వడంతో పాటు నేషనల్ స్థాయిలో క్రీడాకారులు గుర్తింపు పొందేలా కృషి చేస్తామన్నారు. ఈ కార్యక్రమంలో పలువురు క్షత్రియ సంక్షేమ పరిషత్ సభ్యులు పాల్గొని నూతన కమిటీ సభ్యులను అభినందించారు.

కరాటే శిక్షణ శిబిరం ముగింపు


కరాటే శిక్షణ తీసుకున్న చిన్నారులతో నిర్వాహకులు

భీమవరం: డాక్టర్ బీవీ.రాజు వీరమ్మ పార్క్ కాంపౌండ్‌లో చిన్నారులకు కియో జపాన్ షోటోకాన్ కరాటే ఇనిస్టిట్యూట్‌చే ఉచిత కరాటే శిక్షణ నిర్వహించారు. కరాటే శిక్షణ ముగింపు సందర్భంగా శిక్షణ తీసుకున్న బాల బాలికలకు ప్రశంసా పత్రాలు అందజేశారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా పాల్గొన్న రాష్ట్ర పీసీసీ సభ్యుడు, సీనియర్ బాడీ బిల్డర్ అద్దంకి దొరబాబు మాట్లాడుతూ గత 30 ఏళ్లగా కరాటేలో అనేక మందికి శిక్షణ ఇస్తూ, వేసవి సెలవుల్లో క్రీడల వైపు పిల్లలకు ఆసక్తి కలిగించడానికి ఆటపాటలతో పాటు కరాటే లాంటి క్రీడల్లో శిక్షణ ఇప్పించాలన్నారు. నెల రోజులుగా కరాటే ఉచిత శిక్షణ ఇచ్చిన కోచ్ కరణం రాముని అభినందించారు. బాల్యం నుంచి పిల్లలకు విద్యతో పాటు తల్లిదండ్రులు క్రీడల పట్ల ఆసక్తి కల్పించాలని, ముఖ్యంగా బాలికలు కరాటే శిక్షణ తీసుకోవడం ద్వారా ఆత్మ రక్షణకు దోహదపడుతుందన్నారు. భీమవరంలో 50 ఏళ్లకు పైగా కరాటేలో ఎంతో మందికి శిక్షణ ఇచ్చిన కరాటే వెంకట్ మాస్టర్‌ను సత్కరించడం చాలా ఆనందంగా ఉందన్నారు. కార్యక్రమంలో కరాటే కోచ్ కరణం రాము, వెంకట్ మాస్టర్, పుచ్చకాయల రత్నరాజు, కొర్ర శ్రీనివాస్ పాల్గొన్నారు.

వీజేఎఫ్ నూతన కార్యవర్గ ప్రమాణ స్వీకారం

భీమవరం: వాసవి జాగృతి (వీజేఎఫ్) క్లబ్ నూతన కార్యవర్గ ప్రమాణ స్వీకారం భీమవరం ప్యాడి-రైస్ మర్చంట్ భవనంలో ఆదివారం నిర్వహించారు. క్లబ్ ఫౌండర్ ప్రెసిడెంట్ తిరివీధి వేణుగోపాల్ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా విచ్చేసి నూతన కమిటీ చేత ప్రమాణ స్వీకారం చేయించారు. వాసవి జాగృతి (వీజేఎఫ్) భీమవరం క్లబ్ అధ్యక్షుడిగా పత్రిపాటి బీబీఎస్ ఎన్ గుప్త (పత్రిపాటి శ్రీను), కార్యదర్శిగా సబ్బిశెట్టి శ్రీనివాస్ గణేష్, కోశాధికారిగా సంకా అనంత గోపాలం (సంకా గోపి) నియమితులయ్యారు. ఈ సందర్భంగా తిరివీధి వేణుగోపాల్ మాట్లాడుతూ వాసవి జాగృతి క్లబ్ ఆధ్వర్యంలో కులమతాలకతీతంగా ఆర్థిక ఇబ్బందులతో ఉన్న పేద కుటుంబాలకు సహాయ సహకారాలు అందిస్తూ, శాంతి, సహనం, స్నేహం వంటి ఆశయాలతో ముందుకు సాగుతుందని, క్లబ్ విధి విధానాలను తెలియజేశారు. నూతనంగా ఎన్నికైన క్లబ్ అధ్యక్షుడు పత్రిపాటి శ్రీను మాట్లాడుతూ నూతన సభ్యుల సహకారంతో సేవా కార్యక్రమాలు నిర్వహిస్తూ సంస్థకు పేరు ప్రఖ్యాతలు తీసుకువస్తామన్నారు. కార్యక్రమంలో క్లబ్ ఎగ్జిక్యూటివ్ వైస్ ప్రెసిడెంట్ నాగసూరి మురళీమోహన్‌రావు, పువ్వాడ మూర్తి, ఉప్పల మూర్తి, కొల్లిపర పాపారావు పాల్గొన్నారు.

నేడు డిగ్రీ కోర్సులపై అవగాహన

భీమవరం: బీవీ.రాజు డిగ్రీ కళాశాలలో సోమవారం ఉదయం డిగ్రీ ఆనర్స్ కోర్సుల (బీఎస్సీ, బీకాం, బీసీఏ)పై అవగాహన సదస్సు నిర్వహిస్తున్నట్లు ప్రిన్సిపాల్ డాక్టర్ ఐఆర్.కృష్ణంరాజు తెలిపారు. ఈ సదస్సులో డిగ్రీ కోర్సుల ప్రాముఖ్యత, భవిష్యత్ ఉద్యోగ అవకాశాలపై అవగాహన కల్పిస్తామన్నారు. డిగ్రీ పూర్తి చేసిన తర్వాత విద్యార్థులకు అందుబాటులో ఉండే ఉద్యోగ అవకాశాలను వివరిస్తామన్నారు. ప్రముఖ సంస్థల్లో పీజీ కోర్సులు, పోటీ పరీక్షల శిక్షణ అవాకాశాలు తెలియజేస్తామన్నారు. ఈ సదస్సును విద్యార్థులు, తల్లిదండ్రులు సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

కాలువలు ఇలా..పంట సాగు ఎలా?

నరసాపురం: ప్రతి ఏటా వేసవిలో ప్రధాన పంట కాలువలు, మురుగునీటి పారుదల కాలువలకు నిర్వహించే ఓఅండ్ఎం పనులు ఈ ఏడాది నరసాపురంలో రైతులకు ఉపయోగపడే రీతిలో జరగడంలేదు. రసాయనాల ద్వారా పంట, మురుగు బోదెల్లో తూడు, గుర్రపుడెక్క, నాచు తొలగించడానికి ప్రయత్నాలు చేయలేదు. దీంతో నరసాపురం ప్రాంతంలో చాలా చోట్ల పంట, మురుగు కాలువల్లో ఎక్కడ చూసినా తూడు, చెత్త పెరిగిపోయింది. ఎన్నికలు పేరుచెప్పి సంబంధిత అధికారులు ఈ ఏడాది పంట కాలువలు పునరుద్ధరణ చర్యలు చేపట్టకపోవడంతో కాలువల పరిస్థితి మరింత దారుణంగా ఉంది. ప్రతితీ పంట కాలువలోనూ నీటి ప్రవాహానికి ఆటంకం కలిగిస్తూ వ్యర్థాలు, తూడు అడ్డు తగులుతూనే ఉన్నాయి. వర్షాలు పడుతున్న తరుణంలో సాగుకు ఉపక్రమించే రైతులకు కాలువల్లో తూడు ఖచ్చితంగా ఇబ్బంది కలిగిస్తుంది. శివారు ప్రాంతాలకు సాగునీటి సమస్యలు తప్పడం లేదు. అసలే నరసాపురం నియోజకవర్గం కాలువ శివారు ప్రాంతం కావడంతో ప్రతి ఏటా ఇక్కడ అవసరానికి తగిన రీతిలో సాగునీటి సరఫరా జరగక పంటలు దెబ్బతినడం రివాజుగా మారింది.


నరసాపురం ప్రధాన కాలువలో బస్టాండ్ వద్ద చెత్తా, గుర్రపుడెక్క పేరుకుపోయిన దృశ్యం


క్రిస్టియన్ పేట మీదుగా ప్రవహిస్తున్న పంట కాలువలో వ్యర్థాలు


మొగల్తూరురోడ్డులోని ప్రధాన పంటకాలువలో తూడు పేరుకుపోయిన దృశ్యం


తూడు, చెత్త పెరిగిపోయి ఉన్న చినమామిడిపల్లి పంటకాలువ